క్లుప్తంగా

క్రీస్తు బోధనలు అనుసరణీయం



తెనాలి అర్బన్: క్రీస్తు బోధనలు అనుసరణీయమని రక్షణ సైన్యం చర్చి పాస్టర్ గేరా థామస్ పేర్కొన్నారు. ఐతానగర్‌లోని రక్షణ సైన్యం చర్చి పాస్టర్‌గా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ సైన్యం చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గేరా థామస్, గేరా సీయోను కుమార్‌లను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేజర్ పి.నాగరాజు, మేజర్ పి.రత్న సుందరి, సంఘ సభ్యులు రవి, జక్రయ్య, నరసింహ, కనకరత్నం, ఆశీర్వాదం, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన




తెనాలి: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో రూరల్ మండల గ్రామం బుర్రిపాలెంలోని ఇందిరాకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికులకు షుగర్, బీపీ, హెమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్-ఎస్ఎఫ్ మెంటర్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, అధ్యక్షుడు, డ్యూటీ డాక్టర్ ఎస్. సునీల్, ఏపీటీఐ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. కె. వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాల ప్రోగ్రాం అధికారులు టి.జ్యోతిబసు, కె.కళ్యాణ చక్రవర్తి, యూత్ రెడ్ క్రాస్ ఏఎస్ఎన్ ఇన్‌చార్జి టి.లక్ష్మీదుర్గ, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పి.విజయలక్ష్మి హాజరయ్యారు.

ఉమామహేశ్వరుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచల పాలెంలోని అన్నపూర్ణ సమేత ఉమామహేశ్వర స్వామికి కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం విశేష పూజలు అర్చకులు లక్ష్మీ నారాయణశాస్త్రి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయంలోని మూడు అడుగుల ఎత్తున పార్థివ లింగం(మట్టితో), ఆరు అడుగుల ఎత్తులో శీత లలింగాలు ఏర్పాటు చేసి విశేష అర్చనలు నిర్వహిస్తామని చెప్పారు. లక్ష ఒత్తులతో ఆలయం చుట్టూ భక్తులు దీపాలు వెలిగిస్తారన్నారు. స్వామికి సహస్ర బిల్వ దళార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మధుమేహ బాధితులలో మెదడు, నరాల సమస్యలు



గుంటూరు మెడికల్: మధుమేహం, శరీరంలోని ఏ ఒక్క అవయవాన్ని వదిలిపెట్టదని, ప్రతి అవయవంపై ప్రభావం చూపి వాటి అంత ర్నిర్మాణంలో, పనితీరులో మార్పులకు దారితీస్తుందని న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.నటరాజ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్.హెచ్.ఓ. సమావేశ మందిరంలో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా'మధుమేహ బాధితులలో మెదడు-నరాల సమస్యల'పై అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ నటరాజ మాట్లాడుతూ దీర్ఘకాల మధుమేహ బాధితుల్లో రక్తంలో అధిక శాతం షుగర్ ఉండటం వల్ల మెదడు, నరాలు అనేక విధాలుగా ప్రభావితం అవుతాయన్నారు. అటనామిక్ న్యూరోపతిలో శరీరంలోని అవయవాలను ప్రభావితం చేసే నాడులలో అసాధారణ మార్పులు వస్తాయని తెలిపారు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులు మెదడు నరాల సమస్యలను ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్.హెచ్.ఓ. మేనేజర్ పి.నిర్మల రాణి, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మారెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కే సతీష్, సభ్యులు వి.సుబ్రహ్మణ్యం, ఎం.సాంబశివ రావు, సిహెచ్.శివాజీ పాల్గొన్నారు.

కోత మొదలైంది..!

- చుండూరు మండలంలో వరి కోతలు ప్రారంభం
- యంత్రాల ద్వారా కోస్తున్న రైతులు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు



చుండూరులో హార్వెస్ట్ యంత్రం ద్వారా వరి కోస్తున్న రైతు

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలో వరికోతలు ప్రారంభమయ్యాయి. గత రెండు రోజుల నుంచి యంత్రాల ద్వారా వరికోతలను రైతులు ముమ్మరం చేశారు. కూలీల ద్వారా కోతలు, ఓదెలు, కుప్ప నూర్పిళ్లకు ఎకరానికి రూ.22 వేలు ఖర్చు అవుతుండడంతో రైతులు హార్వెస్ట్ మిషన్ల ద్వారా కోతలకు మొగ్గు చూపుతున్నారు. దీనికి ఎకరానికి రూ.6వేలు మాత్రమే ఖర్చుఅవుతున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు లేక తక్కువకు విక్రయాలు..

బాపట్ల జిల్లాలో 156 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి. అయితే ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారస్తులు ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు 75 కిలోల బస్తాను రూ 1450 కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్ సీజనులో 75 కిలోల బస్తా 75 కిలో రూ.1600 నుండి 1700 వందలు వరకు పలికింది. ఈ ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో చాలా తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హార్వెస్ట్ మిషన్ ద్వారా ట్రాక్టరులో ధాన్యం పోస్తున్న దృశ్యం

గిట్టుబాటు ధర కల్పించాలి..



రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో మేం తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి.

– యు. సుబ్బారెడ్డి, రైతు, కారుమూరివారి పాలెం, చుండూరు

ఘనంగా కార్తిక వన సమారాధన



సమారాధనలో పాల్గొన్న విశ్వ బ్రాహ్మణులు



కాపు కార్తిక వన సమారాధన మహోత్సవంలో మాట్లాడుతున్న దాది సూరయ్య

భట్టిప్రోలు: భట్టిప్రోలు కంచి కామాక్షి సమేత బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వబ్రాహ్మణ 23వ వన సమారాధన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడలి జగదీశ్వర కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఏపీ వడ్రంగి అసోసియేషన్ సభ్యులు కోడూరు వెంకటేశ్వరరావు, కమిటీ నిర్వాహకులు చెరుకూరి శ్రీనివాసరావు, కార్యదర్శి పామర్తి లింగాచారి, తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్తిక వన సమారాధన..

అమర్తలూరు(వేమూరు): కాపు సామాజిక వర్గం అన్ని రంగాల్లో ఐక్యంగా ముందుకు వెళ్లాలని కాపు నాయకుడు దాది సూరయ్య పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలోని బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో రెండవ కాపు కార్తిక వన సమారాధన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దాది సూరయ్య పాల్గొని మాట్లాడారు. కన్నా మురళీ కృష్ణ, ఇందిర ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల అధినేత చందు విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, చందు రామారావు, కాపు సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దంత సంరక్షణపై జాగ్రత్తలు అవసరం



తెనాలి: షుగర్ వ్యాధి బాధితులు ప్రతి ఆరు నెలలకు దంత పరీక్షలు చేయించుకోవాలని దంత వైద్య నిపుణురాలు (ఇంప్లాంటాలజి) డాక్టర్ హిమబిందు ఓగిరాల సూచించారు. వాకర్స్‌క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'వృద్ధులు-దంత సమస్యలు-నివారణ' అనే అంశంపై డాక్టర్ హిమబిందు ప్రసంగించారు. దైనందిన జీవితంలో ఆహారం తీసుకున్న తర్వాత నీరు లేదా మౌత్‌వాష్‌తో నోటిని శుభ్రం చేసుకోవాలని తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, లేనిపక్షంలో ఆహార పదార్థాలు పళ్లు, చిగుళ్ల మధ్య పేరుకుపోయి దంతక్షయానికి దారితీస్తుందని హెచ్చరించారు. ధూమపానం చేసే వారికి దంత సమస్యలు అధికంగా వస్తాయని తెలిపారు. షుగర్ బాధితులకూ దంత సమస్యలు అధికమని, ప్రతి ఆరు నెలలకు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని చెప్పారు. సభ్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు. యూఎస్‌వీ మెడికల్ కంపెనీ ఆధ్వర్యంలో సభ్యులుకు మూడునెలల సరాసరి షుగర్ పరీక్షను చేశారు. కంపెనీ ప్రతినిధి రామాంజనేయులు గుండెపోటు వచ్చినప్పుడు తక్షణం చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని వివరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కాకుమాను రామమోహనరావు, అబ్బయ్య, సభ్యులు శ్రీనివాస్, నారాయణ, ప్రసాదరావు, మొవ్వా సత్యనారాయణ, రత్తయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



రేపల్లెలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణంలో సత్యనారాయణ స్వామిని నెలకొల్పి భక్తులచే కలశాలను నెలకొల్పారు. ఆలయ అర్చకులు భక్తులతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేయించారు. కలియుగంలో సత్యనారాయణ స్వామి అవతరణ, వ్రతం చేసుకుంటే కలిగే సిద్ధిని, వ్రత కథల ద్వారా వివరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆలయంలో అన్నసంతర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.



ప్రత్యేక పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

యువకుడికి గాయాలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి ప్రకాష్ నగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న బొలెరొ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక టీవీఎస్ ఎక్స్‌ఎల్ మీద వస్తున్న ఫణీంద్ర వాహనాన్ని ఢీకొట్టాడు. రోడ్డుపై పడడంతో అతడి తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సాయి లక్కరాజు

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత, లఘు చిత్రాల దర్శకుడు సాయి లక్కరాజు బహుముఖ ప్రజ్ఞాశాలిగా శనివారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో పలువురు అభినందించారు. వివిధ మాధ్యమాల ద్వారా సాహిత్యం, కళారంగాలకు సేవలనందిస్తూ, సందేశాత్మక లఘుచిత్రాలతో సమాజ చైతన్యానికి తోడ్పడుతుండటం గొప్ప విషయమని పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటైన సమావేశానికి ప్రముఖ కవి పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు.

వైకుంఠపురంలో సామూహిక సత్యదేవ వ్రతాలు



సామూహిక వ్రతాల్లో దంపతులు

తెనాలి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీసమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీ రమాసహిత సత్యదేవ వ్రతమహోత్సవాలను ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కార్తిక మాసంలో వరుసగా ప్రతి ఆదివారం వ్రత మహోత్సవాలు ఏటా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా తెలిసిందే. ఇందులో భాగంగా 3వ ఆదివారం ఉదయం నుంచి జరిగిన వ్రతాల్లో 151 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు నేతృత్వంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారికి ఉదయం నుంచి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం హరిహరాదులకు ఎంతో ప్రీతిపాత్రమైందని, ఈ మాసంలో శ్రీ సత్యనారాయణ వ్రతాలు జరిపించుకోవడం ఎంతో శుభప్రదమని అధికారులు తెలిపారు. వ్రత మహోత్సవాల్లో పాల్గొనదలచిన దంపతులు రూ.1000 చెల్లించి పేర్లు, గోత్రం నమోదు చేయించుకోవాలని ఈవో అనుపమ తెలియజేశారు.ట్రస్ట్ బోర్డు సభ్యులు బొద్దులూరి సరస్వతి నాగేశ్వరరావు, కురగంటి సునీత రవిశంకర్, దేవరకొండ వెంకట రమణ శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



పూజల్లో చైర్మన్ సాయిబాబు, ఈఓ అనుపమ

షుగరు వ్యాధిపై అవగాహనతో దీర్ఘాయుస్సు

తెనాలి: షుగరు వ్యాధిపై తగిన అవగాహనతో దీర్ఘాయుస్సు పొందవచ్చని పట్టణానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్‌వీ కృష్ణారావు చెప్పారు. ప్రపంచ షుగరు వ్యాధి వారోత్సవాల సందర్భంగా స్థానిక గంగానమ్మపేటలోని కృష్ణ మెడికేర్‌లో ఆదివారం షుగరు వ్యాధి-గుండెపోటుపై అవగాహన సదస్సును డాక్టర్ కృష్ణారావు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులు దాదాపు 500 మందికి ఉచిత షుగరు రక్తపరీక్షలు, వైబ్రోమీటరుతో అరికాళ్ల స్పర్శ పరీక్షలను చేశారు. దేశంలో షుగరు వ్యాధి బాధితుల సంఖ్య శరవేగంగా పెరుగుతోందని చెప్పారు. వంశపారంపర్యం, శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం, ఫాస్ట్ ఫుడ్స్, అధికంగా కొవ్వు, తీపి కలిగిన ఆహారం తీసుకోవడం, శీతలపానీయాల వాడకం ఇందుకు కారణమని తెలిపారు. ఆహార నియమాలు, వ్యాయామంతో షుగరును అదుపులో ఉంచుకోవాలని సూచించారు. వ్యాధి కారణంగా శరీరంలోని రక్తనాళాలు దెబ్బతింటాయని, ముఖ్యంగా కళ్లు, గుండె, మెదడు, మూత్రపిండాలు, పాదాల రక్తనాళాల్లో సమస్యలు ఏర్పడి వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. వ్యాధిపీడితులకు గుండెపోటు వచ్చే అవకాశం అయిదు రెట్లు ఎక్కువని తెలిపారు. పొగతాగడం విధిగా మానాలని, కంటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

గ్రంథాలయాలు

విజ్ఞాన భాండాగారాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ



భట్టిప్రోలు గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన రంగవల్లుల పోటీలలో పాల్గొన్న బాలికలు, మహిళలు

బాపట్లటౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు పరుగుపందెం, క్యారమ్స్ పోటీలతో పాటు కవి సమ్మేళనం నిర్వహించారు. వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే పుస్తక పఠనం తప్పనిసరి అన్నారు. పెద్దలపట్ల గౌరవంతో మెలగడానికి, జీవితంలో మంచి ఉద్యోగాలు సంపాదించి ఎదగటానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ప్రతి ఒక్కరు ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదువుకోవాలని, గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలన్నారు. కవులు డాక్టర్ శ్రీనివాసరావు, కె.శ్రీరామచంద్రమూర్తి రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు..

చుండూరు(వేమూరు): యడ్లపల్లి శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు ఆదివారం శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. అదేవిధంగా క్యారమ్ పోటీలను సైతం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.గిరిజ సుందరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలు

భట్టిప్రోలు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని భట్టిప్రోలులోని మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో ఆదివారం బాలికలు, మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 35 మంది పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో ఎం.కల్యాణి, ఎ. దేవశ్రీ, ఎ.హసినీ ప్రియ, సీనియర్ విభాగంలో జి.ఊహాస్మిత, టి.నాగఅశ్విని, డి.నవ్యశ్రీ ప్రతిభ చూపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్, తలశిల సత్యవతి, లీలా నాగవేణి, పాఠకులు పాల్గొన్నారు.

నగరం: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మండలంలోని మంత్రిపాలెం గ్రామ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన పాటలు, కథల పోటీల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలలో అమితమైన విజ్ఞాన సంపద ఉంటుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకుడు బ్రహ్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



యడ్లపల్లి గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చుండూరు(వేమూరు): గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించడం జరిగిందని చుండూరు శాఖ గ్రంథాలయాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, డిబేట్, తెలుగు డిక్టేషన్ పోటీలు ఆదివారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): ఇంటూరు శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రంథాలయంలో పర్యవరణ, పరిరక్షణ అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): వలివేరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20వ తేదిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు పంపిణీ చేస్తామని గ్రంథాలయాధికారి వివేక్ తెలిపారు.

లక్ష్మయ్య సేవలు ఎనలేనివి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె రూరల్: దళితులు, వ్యవసాయ కూలీల అభ్యున్నతికి అమిరినేని లక్ష్మయ్య చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన అమిరినేని లక్ష్మయ్య సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలే అజెండాగా కమ్యూనిస్టులు మాత్రమే ప్రజలకు అండగా నిలబడుతున్నారని అటువంటి సీపీఎంతో అనేక ఉద్యమాలలో లక్ష్మయ్య పాల్గొన్నారని గుర్తు చేశారు. రేపల్లె ప్రాంత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు కొరటాల సత్యనారాయణ, మోటూరి హనుమంతరావులతో పాటు అనేక రైతాంగ ఉద్యమాలలో పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సీపీఎం నాయకులు డి.బాబురావు, కేవీ లక్ష్మణరావు, కె.రమేష్, జి.ధర్మరాజు, బి.ఆగస్టిన్, నల్లూరిపాలెం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తూకంలో మోసాలకు పాల్పతున్న పది దుకాణాలపై కేసులు

తెనాలి: తూకంలో మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ తెనాలి ఇన్‌స్పెక్టర్ బి. శేషసాయి హెచ్చరించారు. డెప్యూటీ కంట్రోలర్ టి.షాలేమ్‌రాజు ఆదేశాలతో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని చికెన్, మటన్, కూరగాయల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకంతో పాటు మెషీన్లను పరిశీలించారు. తూకంలో మోసాలకు పాల్పడుతున్న పదిమంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. చినరావూరు తోట పరిసర ప్రాంతాలలో చికెన్, మాంసం దుకాణాల్లో మోసాలు జరుగుతున్నాయని గుర్తించి హెచ్చరించారు. సాధారణ కాటాలను వినియోగించే వ్యాపారులు, రాళ్లకు ఎప్పటికప్పుడు ముద్రలు వేయించుకోవాలని ఆయన సూచించారు. లైసెన్స్ లేని ఇద్దరు వ్యాపారులపైనా కేసులు నమోదు చేశారు. తూకం, కొలతల్లో ప్రజలను మోసగించటం నేరమే కాకుండా మహా పాపమని తెలిపారు. వీరితో టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.రవికిశోర్ ఉన్నారు.



చికెన్ షాపులో తూకం పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శేషసాయి